



అమరావతిలో జరుగుతున్న రాష్ట్రస్థాయి కలెక్టర్ల సమావేశంలో పాల్గొన్న కర్నూలు కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి.

# ఉల్లి క్వింటాకు రూ.2500 ఇవ్వాలి

## - సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్

**ప్రజాశక్తి - కోడుమూరు**

సిపిఎం బృందం ,జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్. రాధాకృష్ణ, సిపిఎం మండల కార్యదర్శి కె.రాజు, మండల నాయకులు గఫూర్ మియ్యా బృందం కలిసి వర్కూరు గ్రామంలోని పంట పొలాల్లో ఉన్న ఉల్లి పంటలను పరిశీలించారు. శివ అనే రైతు పొలానికి వెళ్లి పరిశీలించగా రెండు ఎకరాల పొలంలో దాదాపు రూ.ఒక లక్ష 80 వేలు పెట్టుబడి పెట్టి బాధపడుతున్నారు. ఇప్పటికే 15 రోజుల కిందట ఉల్లిని కోశారు. ఆ ఉల్లిని కోత కోసి గ్రేడింగ్ చేయాలంటే దాదాపుగా రూ.40 వేలు ఖర్చు వస్తుందంటున్నారు. అలా చేసిన గిట్టుబాటు ధర లేక కోసిన ఉల్లిగడ్డను పొలంలో వదిలిపెట్టారు. రైతు శివను అడిగి తెలుసుకుంటే కనీసం ప్రభుత్వం నుండి క్వింటాలుకు రూ.2000 ధర కల్పిస్తే కనీసం పెట్టుబడి అయినా కొంతమేర వస్తుందని అంటున్నాడు. ప్రభుత్వం రైతులను ఆదుకోకపోతే పెట్టిన పెట్టుబడులు రాక అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు ఉన్నాయి. సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశ మాట్లాడుతూ ప్రభుత్వం మార్కెట్లో కొనుగోలు చేసే దానికన్నా రైతుల దగ్గరికి వచ్చి పొలాల్లోనే మార్కుఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తే కనీసం వారికి రవాణా ఖర్చు అయిన మిగులుతుంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో మాట్లాడి ఉల్లిని నిలువ ఉంచుకోవడానికి గోదాములు నిర్మిస్తే తర్వాత అయినా అమ్ముకోవడానికి వీలుంటుంది. పండించిన పంటను వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తే రైతులకు ఇన్ని కష్టాలు ఉండవు ఉల్లిపంట కూడా పాడవదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రూ.1200 ప్రకటించింది అది ఏమాత్రం చాలదు కనీసం రూ.2500 అయినా ధర ప్రకటిస్తే పెట్టిన పెట్టుబడి అయినా రైతుకు అందుతుందన్నారు. పరిశీలనలో భాగంగా ఒక మహిళ రైతును విచారించగా ఉల్లి పంట పెరగడానికి రూ.10000 ఖర్చు వచ్చింది గిట్టుబాటు ధర లేక ఉల్లి అమ్ముకోలేక కనీసం బయట రోడ్డు పైన పారబోస్తామనుకుంటే అందుకు కూలీలకు రూ.20000 ఖర్చవుతుంది. అలాగే వదిలేస్తే పొలం చెడిపోయి గడ్డి పెరుగుతుంది. ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నామని రాష్ట్ర ప్రభుత్వమే తమరిని ఆదుకోవాలని మహిళా రైతు ఆవేదన వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఉల్లి రైతులను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



కోడు మూరు మండల ఉల్లి రైతులతో మాట్లాడుతున్న గౌస్ దేశాయ్, ఇతర నాయకులు

**టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలి**

**పత్తికొండ :** టమోటా పంటకు గిట్టుబాటు ధరకల్పించి రూ.10తో తక్షణమే కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పత్తికొండ వ్యవసాయ మార్కెట్లో టమోటా రైతుల సమస్యలను సిపిఎం బృందం పరిశీలించారు. గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ... టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట కోత కోసి మార్కెట్‌కు తీసుకొస్తే కనీస మద్దతు ధరకు కూడా కొనుగోలు చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారని అధికారులపై మండిపడ్డారు. మార్కెట్లో కిలో రూ.2, 3తో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నా మార్కెట్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వ్యాపారస్తులు టమోటా నాణ్యత పేరుతో రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట సాగు చేయడానికి పెట్టిన పెట్టుబడి , కూలీ, రవాణా ఖర్చులు రాకపోతే రైతు ఎలా బతుకుతారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పిన మాటలు మాటలకే పరిమితమైందన్నారు. మార్కెట్లో ఇంత జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులు సందర్శించకపోవడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయకపోతే రైతులను కలుపుకొని ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్ సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి, సిపిఎం మండల కమిటీ సభ్యులు సిద్దయ్య గౌడ్,సురేంద్ర ,గంగన్న, తుగ్గలి మండల కార్యదర్శి శ్రీరాములు , ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు కాశి, రమేష్, సిఐటియు మద్దికేర మండల కార్యదర్శి రాముడు ప్రజా సంఘాల నాయకులు మధు ,దుర్గప్ప , కారప్ప పాల్గొన్నారు.



పత్తికొండ మార్కెట్‌లో టమోటా రైతులసమస్యలు తెలుసుకుంటున్న గౌస్‌దేశాయ్, రాధాకృష్ణ, నాయకులు

# భూములను లాక్కొంటే అడ్డుకుంటాం

## - వామపక్ష నాయకులు



రైతులతో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

**ప్రజాశక్తి - ఆలూరు**

రెండు పంటలు పండించే సారవంతమైన భూములను ప్రభుత్వం బలవంతంగా లాక్కుంటే అడ్డుకుంటామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ హెచ్చరించారు. మండలంలోని మనేకుర్తి గ్రామంలో పవర్ గ్రిడ్ కోసం భూమి సేకరిస్తున్న రైతులతో మాట్లాడారు. సారవంతమైన భూములను ప్రభుత్వం తమ నుంచి బలవంతంగా లాక్కొంటుందని రైతులు వాపోయారు. గ్రామానికి దూరంగా ఉండే నిస్సారమైన భూములను వాడుకుంటే తమకే అభ్యంతరం లేదన్నారు. వామపక్ష నాయకులు మాట్లాడుతూ... ప్రభుత్వం భూసేకరణను పారదర్శకంగా నిర్వహించడం లేదన్నారు. మొదట రూ.6 లక్షలు ఇస్తామన్న ప్రభుత్వం రూ.18 లక్షలకు పెంచడం వల్ల ఎన్నో అనుమానాలు తలెత్తుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం పవర్ గ్రిడ్ కోసం భూసేకరణ చేస్తే ఎవరికీ ఎలాంటి అభ్యంతరాలు లేవని, నిస్సారమైన భూములను ఉపయోగించుకోవాలని చెప్పారు. ఈ విషయంపై విద్యుత్ రాష్ట్ర అధికారులతో మాట్లాడతామన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సిపిఐ నాయకులు రామచంద్రయ్య, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సుదర్శన్, నాయకులు రాధాకృష్ణ, హనుమంతు, నారాయణ స్వామి, వీరేశ్, వీరేష్, గోపాల్, కరెన్న పాల్గొన్నారు.

**గోడ కూలి విద్యార్థి మృతి**

కర్నూలు నగరంలోని కవాడీ వీధిలో సోమవారం కీర్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్ పాఠశాల గోడ కూలడంతో విద్యార్థి హాకిబ్ (5) మృతి చెందాడు. మరో విద్యార్థి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

వివరాలు మెయిన్‌లో



పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

# అలసత్వం వహించక పరిష్కరించాలి

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

అర్జీదారుల నుండి వచ్చిన అర్జీలను అలసత్వం వహించకుండా పరిష్కరించాలని జెసి డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియం లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం లో భాగంగా జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జెసి ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు.. పిజిఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీల ఆడిట్ పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. పిజిఆర్ఎస్ లాగిన్ లో వచ్చిన అర్జీలను అలసత్వం వహించకుండా పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు చూడాలన్నారు. డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**'స్వస్థ నారీ - సశక్త్ పరివార్ పోస్టర్ ఆవిష్కరణ**

'స్వస్థ నారీ – సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య ఆవిష్కరించారు. డి ఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.




గోడపత్రికను ఆవిష్కరిస్తున్న జెసి, అధికారులు

# విద్యారంగం పట్ల చిన్నచూపు తగదు

- -యాప్‌లను రద్దు చేయాలి - పిఆర్‌సి కమిషన్ ప్రకటించాలి
- - కర్నూల్లో యుటిఎఫ్ రణభేరి ప్రారంభం
- - ఉపాధ్యాయుల నుంచి అనూహ్య స్పందన

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యారంగం పట్ల చిన్నచూపు చూస్తుందని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ విమర్శించారు. గత ప్రభుత్వ విధానాలనే కూటమి ప్రభుత్వం కూడా యధావిధిగా అమలు చేస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడం కంటే యాప్‌లల్లో వివరాల నమోదు చేయడమే పనిగా మారిందన్నారు. వెంటనే ఈ యాప్‌లన్నిటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు నగరంలోని స్థానిక జిల్లా పరిషత్తు నుండి యుటిఎఫ్ పశ్చిమ ప్రాంతం రణభేరి జాతర ప్రారంభమైంది. జిల్లా అధ్యక్షుడు యుఆర్ఎ రవికుమార్ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభలో రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, జయ చంద్రరెడ్డి పాల్గొన్నారు. రణభేరి జాతాను కె.సురేష్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ జాతా బృందానికి నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున జాతాకు స్వాగతం పలికారు. జిల్లా పరిషత్ నుండి రాజ్ విహార్, కొత్త బస్టాండ్ మీదుగా బళ్లారి చౌరస్తా వరకు జాతా బృందానికి ఉపాధ్యాయులు బైక్‌ర్యాలీ నిర్వహిస్తూ తమ మద్దతు ప్రకటించారు. అనంతరం పెద్దపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జాతా చేరుకోగానే ఉపాధ్యాయులు వారికి అపూర్వ స్వాగతం పలికారు. కట్టమంచి రామలింగారెడ్డి మున్సిపల్ స్మారక పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ దూదేకొండ కుమార్ ఈ జాతాకు స్వాగతం పలికారు. అనంతరం ఉపాధ్యాయులను ద్దేశించి వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలనే యధావిధిగా అమలు చేస్తుందన్నారు. పాఠశాల విద్యారంగ వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు. జిఒ నెంబర్117 రద్దు చేస్తామని ప్రకటన చేసిన మంత్రి నారా లోకేష్ ఇప్పటివరకు ఎక్కడ ఆచరణకు నోచుకోలేదన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అప్పగించబోమని చెప్పారన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభంలో యోగా శిక్షణ, మెగా పేరెంట్ టీచర్స్ మీటింగుల పేరుతో సమయం వృథా చేశారన్నారు. భోదనేతర పనులన్నిటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల కు పిఆర్సి కమిషన్ గడువు ముగిసిన కొత్త పిఆర్సి ప్రకటించలేదన్నారు. కొత్త పిఆర్సి కమిషన్ ప్రకటించి వెంటనే ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. కారుణ్య నియామకాలు కూడా వెంటనే నిర్వహించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ జాతా ద్వారా ఉపాధ్యాయులను చైతన్యం చేస్తున్నామన్నారు. ఈనెల 25న రాజధాని ప్రాంతం లో నిరసన చేపడుతున్నట్లు ప్రకటించారు. అప్పట్లోగా ప్రభుత్వం స్పందించి డిమాండ్లను పరిష్కరించాలని హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నవీన్ పాటి, జిల్లా ఆర్థిక కార్యదర్శి కె.యెహోషువ, జిల్లా సహాధ్యక్షులు జి.హేమంత్ కుమార్ జిల్లా కార్యదర్శులు తిమ్మన్న ,దుర్గాప్రసాద్, లక్ష్మీదేవి, చంద్రకళ, ఇబ్రహీం జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లప్ప జిల్లా నాయకులు జయరాజు అనిల్ హనుమంతు, హనుమన్న ,సోమన్న ,సర్వేశ్వర్ రెడ్డి, భాస్కర్, సురేష్ సుధాకర్ ,రాములు ,కెంగరమోహన్ తదితరులు పాల్గొన్నారు.




రణభేరి జాతాను ప్రారంభిస్తున్న సురేష్‌కుమార్



కలెక్టరేట్ ఎదుట ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న నగర అధ్యక్షులు జిలాని బాష

# రైతులకు యూరియా సరఫరా చేయాలి

**కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ కిసాన్ సెల్ ధర్నా**


**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

రైతులకు ఎలాంటి షరతులు లేకుండా యూరియాను సరఫరా చేయాలని జిల్లా కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ ఎ. సూర్య ప్రకాష్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ కిసాన్‌సెల్ ఆధ్వర్యంలో ధర్నాచేశారు. ఎ. సూర్య ప్రకాష్ రెడ్డి, కర్నూలు సిటీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జిలాని బాషా మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో వైఫల్యం చెందిందన్నారు. రైతులకు అవసరమయ్యే ఎరువులను కూడా ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఉల్లి రైతులకు కనీసమద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ నవ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, పత్తికొండ కోడుమూరు నియోజక వర్గాల కోఆర్డినేటర్లు బి. క్రాంతి నాయుడు, అనంతరత్నం మాదిగ, రాష్ట్ర ఐ ఎన్‌టియుసి ఫెడరేషన్ అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి బాషా, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న, ఎస్‌సిసెల్ జిల్లా అధ్యక్షులు ఎన్‌సి బజారన్న, పాల్గొన్నారు.

# రోడ్డును తవ్వి వదిలేసిన కాంట్రాక్టర్

**వెంటనే గుంతలు పూడ్చాలి కమిషనర్ ఆదేశం**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ :** బళ్లారి చౌరస్తా లో జాతీయ రహదారి కి చెందిన సర్వీసు రోడ్డుపై చిన్నపాటి చెరువుల్లాగా పడ్డ గుంతల వల్ల పక్కనే ఉన్న దేవుని గుడికి ప్రమాదం పొంచి ఉందని సమీప కాలనీల ప్రతినిధులు ఎన్.రవీంద్ర, ఏనుగుల పుల్లారెడ్డి, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఎ.వెంకటేశ్వర్లు, ఇరిగినేని.పుల్లారెడ్డి నగరపాలక సంస్థ కమిషనర్ దృష్టికి తెచ్చారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం వినతి పత్రం అందజేశారు. ప్రమాదం పొంచి ఉన్న రోడ్ల గుంతల ఫోటోలను కమిషనర్‌కు ఇచ్చారు. వారు మాట్లాడుతూ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చామన్నారు. కలెక్టర్ ఆదేశించినప్పటికీ మాకు సంబంధం లేదు అంటూ హైవే అధికారులు ఇచ్చిన ఉత్తరాన్ని కమిషనర్‌కు చూపించారు. గుంతలు పడ్డ రోడ్ల ఫోటోలను చూసిన కమిషనర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మాకు సంబంధం లేనప్పటికీ మానవతా దృక్పథంతో బళ్లారి చౌరస్తా గుడి పక్కన రోడ్డును వెంటనే మరమ్మతులు చేస్తామని కమిషనర్ విశ్వనాథ్ చెప్పారు. ఆర్‌టిసి బస్టాండు నుండి సీతా రామ నగర్ మీదుమీగా మంత్రి క్యాంప్ ఆఫీస్‌తో పాటు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఉపయోగపడే ఈ రోడ్డు నిర్మాణానికి అంచ నాలను తయారు చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు.



కమిషనర్‌కు వినతి ఇస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు

# లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పోరాటం

**సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు**

**ప్రజాశక్తి-గూడూరు**

కేంద్ర ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చాలనే లేబర్‌కోడ్లకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు సూచించారు. గూడూరు సిఐటియు కార్యాలయంలో మండల మహాసభ నిర్వహించారు. అంజిబాబు, సిఐటియు మండల అధ్యక్షుడు జె. మోహన్ మాట్లాడారు. బ్రిటిష్ ప్రభుత్వ కాలంలో కార్మికులత్తమ హక్కులను కోసం పోరాటాలు చేసి 44 రకాల కార్మిక హక్కులను చట్టాలను సాధించుకున్నారని, ఆ నాటి నుండి కార్మికులు తమ హక్కుల కోసం అనేక పోరాటాలు చేసి తమ వేతనాలు తమ హక్కులను సాధించుకున్నారని తెలిపారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక దేశంలో ప్రభుత్వం రంగాలను ఆదాని అంబానీ లాంటి బడా కార్పొరేట్ పెట్టుబడుదారులకు ప్రైవేట్ వరం చేయడానికి కార్మిక చట్టాలు అడ్డంగా ఉన్నాయని, వాటిని రద్దు చేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. అందులో భాగంగానే 44 రకాల కార్మిక చట్టాలు రద్దు చేసి కేవలం నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేసి కార్మికులను కట్టు బానిసలుగా చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అమలు చేయడానికి ప్రయత్నం చేసిందని రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ సమావేశంలో ఎనిమిది గంటల పని విధానాన్ని కాదని 10 విధానాన్ని అమలు చేయాలని, నైట్ డ్యూటీలు మహిళలు కూడా చేయాలని క్యాబినెట్ సమావేశం తీర్మించిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తారని అన్నారు. అనంతరం గూడూరులో సిఐటియు మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గూడూరు మండల అధ్యక్షునిగా జె. మోహన్, కార్యదర్శిగా గుంటప్ప, ఉపాధ్యక్షులుగా రాజశేఖర్, హమాలి మద్దిలేటి, హమాలీ శాంతన్న, మున్సిపల్ సహాయ కార్యదర్శులుగా శేషమ్మ, రాజులతో పాటు మొత్తం 21 మందితో మండల కమిటీని ఎన్నుకున్నారు. సిఐటియు మండల నాయకులు సుబ్బమ్మ, రాజశేఖర్, సుజాత, పద్మ, హమాలీ కార్మికుల మధు, మద్దిలేటి, రామాంజనేయులు, దానమన్న మునెప్ప వెంకటేశ్వర్లు, కృప తదితర రంగాల కార్మికులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న అంజిబాబు

# మెప్మా పిడికి ఆర్‌పిల స్వాగతం

**ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్**

ఎపి మెప్మా ఆర్పీ ఉద్యో గుల సంఘం (సిఐటియు) జిల్లా కార్య దర్శి ఎస్. ఉమా దేవి నగర అధ్యక్ష కార్య దర్శులు రుద్రమ్మ, షబానా ,కమిటీ సభ్యులు మంజుల, సుజాత, కైరున్, జ్యోతి కొత్తగా వచ్చిన పిడి శ్రీనివాసులును సోమవారం మెప్మా కార్యాల యంలో మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఐబి మురళి , సిఎంఎం భాస్కర్ రెడ్డి ఉన్నారు. పూలబొకే ఇచ్చి స్వాగతం శుభాకాంక్షలు తెలిపారు.



# 2590 ఉపాధ్యాయ పోస్టుల నియామకాలు

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

ఇటీవల నిర్వహించిన డిఎస్‌సిలో2678 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా అందులో2590 పోస్టుల నియామకాలు చేపట్టినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో మిగిలినటువంటి 28 పోస్టులను తదుపరి డిఎస్‌సిలో భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఈ పోస్టులకు ఎంపికైనటువంటి అభ్యర్థులు ఈనెల 19న సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలను విజయవాడలో అందజేస్తారన్నారు.

ఈనెల 18న పోస్టులకు ఎంపికైన అభ్యర్థులందరూ సర్టిఫికెట్ పరిశీలన కేంద్రాలకు వచ్చి రిపోర్ట్ చేసుకోవాలని పేర్కొన్నారు.

# టిజి. భరత్ కుటుంబం కబ్జాలకు పాల్పడదు

**కుడాచైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు**

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్** : దానధర్మాలు చేయడం తప్ప కబ్జాలకు పాల్పడే గుణం టిజి.భరత్ కుటుంబానిది కాదని పలువురు టిడిపి నాయకులు అన్నారు. సోమవారం కర్నూలు టిడిపి జిల్లా కార్యాలయంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకే పోగు ప్రభాకర్, నగర అధ్యక్షులు నాగరాజు యాదవ్, కార్పొరేటర్ జకియా అన్సారి, టిడిపి యువజన నాయకులు అబ్బాస్ పలువురు టిడిపి నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడ, విశాఖపట్టణం, తిరుపతి, కర్నూలు నగరాలను స్మార్ట్ సిటీలుగా తీర్చిదిదేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రభుత్వ స్థలాలున్న ప్రాంతాలను గుర్తించాలని ప్రభుత్వ యంత్రాగాన్ని ఆదేశించారని, ఇందులో భాగంగానే అధికారులు స్థలాలను గుర్తిస్తున్నారన్నారు. అధికారులు గుర్తించిన ఎబిసి క్యాంపులను రాజకీయం చేస్తూ మంత్రి టిజి. భరత్‌పై వైసిపి తమ సొంత పత్రికను అడ్డుపెట్టుకొని అసత్య ప్రచారాలకు పూనుకుంటుందన్నారు. కబ్జాల చరిత్ర వైసీపీ ది అందులో నాయకులదేతప్ప టిజి.భరత్ కుటుంబానికి లేదన్నారు. నిజానికి బి క్యాంప్ లోని ప్రభుత్వ క్వార్టర్స్ లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేనివారు ఆక్రమణ చేసి నివాసం ఉంటున్నారన్నారు. అక్కడ మందుబాబులు పేకాటరాయులకు క్వార్టర్స్ స్థావరంగా మారాయి అన్నారు. ఈ నేపథ్యంలోనే స్థానికుడైన కె. జగన్ అనే వ్యక్తి లోక్ అదాలత్లో కేసును వేశారని అన్నారు. దీని ఆధారంగానే అక్కడ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వారి వివరాలను సేకరించి ఖాళీ చేయించాలని లోకాయుక్త ఆదేశించిందన్నారు. వై.సి.పి. వారికి తెలియకుండా టి.జి. భరత్ మినీ స్టేడియం నిర్మించు కోవడానికి, ఖరీదైన హొటళ్ళు నిర్మించేందుకు స్థలాలను కబ్జా చేసేందుకు పూనుకుంటున్నారని తప్పుడు కథనాలు వ్రాసి ప్రజలకు వైసిపి నాయకులు తప్పుడు సంకేతాలు ఇస్తున్నారన్నారు. వైసిపి నాయకుల కబ్జాల భాగోతాన్ని బయటికి తీస్తామన్నారు. తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమిశెట్టి నవీన్, రాష్ట్ర కార్యదర్శి పి. రవికుమార్, యస్. అబ్బాస్, సాంస్కతిక విభాగం అధ్యక్షులు పి.హనుమంతరావు చౌదరి, తదితరులు పాల్గొన్నారు.



బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

# పోలీస్ గ్రీవెన్స్‌కు 81 ఫిర్యాదులు

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 81 ఫిర్యాదులు అందాయని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అన్నారు. కర్నూలు ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.ఉద్యోగం పేరుతో మోసగించారని, డిజిటల్ అరెస్టు పేరుతో మోసగించారని, పంటను నాశనం చేశారని, షూరిటీ ఇప్పించుకున్న వ్యక్తి రుణం తీర్చకుండా పారిపోయాడని, కోర్టు ఇల్లు ఖాళీ చేయమని ఉత్తర్వులు ఇచ్చిన పాటించడం లేదని, పొలం హద్దురాలను దౌర్జన్యంగా తొలగించి ఆక్రమణకు కొనుకున్నారని ఫిర్యాదులు సహా అనేక ఫిర్యాదులు అన్యాయని ఎస్‌పి పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్‌పి హామీ ఇచ్చారు. అడిషనల్ ఎస్‌పి హుస్సేన్ పీరా, సిఐ లు పాల్గొన్నారు.

# మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళి

**ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్**

రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రెక్టార్ ఎన్‌టికె నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాగు, తాగు నీటిప్రాజెక్టులకు రూపకల్పనచేసిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య భారతదేశం గర్వించదగ్గ ఇంజనీరు అని పేర్కొన్నారు. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

**వొకేషనల్ కళాశాలలో** : కర్నూలు బి క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపల్ , లెక్చరర్స్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి పూల మాల వేసి ఘనమైన నివాళులర్పించారు. కళాశాల లెక్చరర్స్ ప్రసన్న కుమార్, రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, లక్ష్మి , శ్రీధర్ , లావణ్య విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్‌యులో విశ్వేశ్వరయ్యకు నివాళి


మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్

## ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం

**- యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సోమప్ప సర్కిల్‌కు 'రణభేరి జాతా' చేరుకుంది. ఈ జాతాను స్థానిక ఉపాధ్యాయులు, నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగంలో సమస్యలు పరిష్కరించకుండా ఉపాధ్యాయులను సమాజంలో దోషులుగా చిత్రీకరించే పని చేస్తోందని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు కట్టబెడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, జయచంద్ర రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులకు చదువు చెప్పనీయకుండా ఆన్‌లైన్, అప్‌లోడింగ్ కార్యక్రమంగా విద్యాశాఖ కార్యక్రమాన్ని మార్చేశారని తెలిపారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి మాట్లాడుతూ... 12వ పిఆర్‌సి కమిషన్ రాజీనామా చేసి 15 నెలలు గడిచినా మరొకరిని నియమించలేదని, ఈ కాలంలో కనీసం ఒక్క డిఎ కూడా ఇవ్వలేదని తెలిపారు. జిల్లా గౌరవాధ్యక్షులు దావీదు, జిల్లా సహాధ్యక్షులు హేమంత్ కుమార్, జిల్లా కార్యదర్శులు బాబు, కౌలన్న, తిమ్మన్న, గాదిలింగ, జిల్లా ఆడిట్ కన్వీనర్ శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్లు ఎల్లప్ప, ఎల్ల నాగమణి, సుధాకర్, ఆడిట్ కమిటీ సభ్యులు రామాంజనేయులు, రాజు, మల్లారి నాగరాజు పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాల ప్రయివేటీకరణ దుర్మార్గం

**- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప**


రాస్తారోకో చేపడుతున్న నాయకులు

**ప్రజాశక్తి - ఆదోని**


ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రయివేటీకరణ చేయడం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు విమర్శించారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామీణులకు వైద్య విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు ఆదోనిలో ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కళాశాల పనులను నిలిపేసి పిపిపి (పబ్లిక్ ప్రయివేట్ పార్ట్‌నర్‌షిప్) పద్ధతిలో కొనసాగించడానికి కేబినెట్ తీర్మానం చేయడం అన్యాయమని విమర్శించారు. ప్రయివేటీకరణతో పేదలకు వైద్య విద్య పరిస్థితి ఉండదని, ప్రభుత్వమే వైద్య కళాశాలను నడపాలని డిమాండ్ చేశారు. పిపిపి విధానాన్ని రద్దు చేయకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శశిధర్, నాయకులు రిషి, మోహన్, రాజు, మహేష్, తేజ, మహేష్ పాల్గొన్నారు.

## 'జగనన్న' ఇళ్ల స్థలాలు మాకొద్దు

**- గ్రామస్తుల వినతి**

**ప్రజాశక్తి - కౌతాళం**

కౌతాళం గ్రామానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈచనహాల్ వంక ముంపు ప్రాంతంలో జగనన్న కాలనీలో ఇచ్చిన స్థలాలు తమకొద్దని, వాటికి బదులుగా గ్రామానికి దగ్గరలో నివాసాలకు అనువైన స్థలాలు ఇవ్వాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం సహకార సంఘం అధ్యక్షులు వెంకటపతి రాజు ఆధ్వర్యంలో తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన స్థలాల్లో ఎవరూ ఇల్లు కట్టుకోలేదని, అధికారులు స్పందించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. జగనన్న కాలనీలో పట్టా వచ్చిన ప్రతి లబ్ధిదారునికీ వేరేచోట స్థలాలు వచ్చేలా న్యాయం చేస్తామని తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈచనహాల్‌లో పట్టాలు వచ్చిన లబ్ధిదారులకు, కౌతాళంలో ఇంటిస్థలాలు లేని ప్రతిఒక్కరికీ స్థలాలు ఇప్పిస్తామని అల్లూరి వెంకటపతి రాజు తెలిపారు. టిడిపి నాయకులు సౌద్రీ బసవరాజు, డాక్టర్ రాజానంద్, కురువ వీరేష్, గిరి, బిజెపి నాయకులు రామచంద్ర, సిద్ధప్ప, నరసప్ప, నబీ, గొట్టయ్య, తాయన్న, గురు, సురేష్, పంపాపతి, దుర్గాదాస్ పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

# హక్కుల సాధనకు మరింత ఐక్య ఉద్యమం

**- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు**


మాట్లాడుతున్న ఆనంద్ బాబు

**ప్రజాశక్తి - ఆదోని**

దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను సక్రమంగా అమలు చేసేందుకు సమిష్టి ఉద్యమానికి సిద్ధం కావాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.దేవసహాయం, ఎమ్‌డి.ఆనంద్‌బాబు కోరారు. సోమవారం పట్టణంలోని ఎన్‌జిఒ హోమ్‌లో కెవిపిఎస్ మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో '79 సంవత్సరాల స్వాతంత్య్రం-దళితులు' అనే అంశంపై జిల్లా సదస్సు నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.తిక్కప్ప అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దేవ సహాయం, ఆనంద్ బాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి కరుణాకర్ మాట్లాడారు. దళితులపై జరుగుతున్న దాడుల్లో దేశంలోనే రాష్ట్రం మూడు, జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. ఆదోని పశ్చిమ ప్రాంతంలో దాడులకు హద్దే లేదన్నారు. ఎమ్మెల్యే కుల దురహంకారంతో సర్పంచిపై వివక్ష చూపినా కేసు నమోదు చేయలేదని తెలిపారు. ఇప్పటికీ ఆదోని డివిజన్ పరిధిలో అంటరానితనం కొనసాగుతోందని చెప్పారు. వివక్షను నిర్మూలించడానికి అధికారులకు చేతులు రావడం లేదని విమర్శించారు. కెవిపిఎస్ మండల అధ్యక్షులు మునిస్వామి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర, విజయ్, జిల్లా నాయకులు జయరాజు, విజయమ్మ, కృష్ణ, మారయ్య, రమణ, తిమ్మన్న, అంజి, వీరేష్ ఉన్నారు.

## మహిళలపై అఘాయిత్యాలను అరికట్టాలి

**- ఐద్వా రాష్ట్ర నాయకులు నిర్మల**


మాట్లాడుతున్న నిర్మల


**ప్రజాశక్తి - ఆదోని**

మహిళలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలపై ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర నాయకులు పి.నిర్మల కోరారు. సోమవారం ఆదోనిలో ఐద్వా మహాసభలు జరిగాయి. ముఖ్యఅతిథిగా నిర్మల హాజరయి మాట్లాడారు. మహిళలకు అన్ని విధాలుగా రక్షణ కల్పిస్తామని మాటలు చెబుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల భద్రత విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. మహిళలపై రోజురోజుకూ దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదోనిలో మహిళా ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా నాయకులు పి.ఎస్.సుజాతమ్మ, పాండవగల్ సర్పంచి కె.ఉమాదేవి, మాజీ కౌన్సిలర్ పిఎస్.ముత్తమ్మ, ఆర్.మస్కూల్ భాను, బి.పద్మ, కె.మునెమ్మ, పి.దస్తగిరమ్మ, కిష్టమ్మ, తిక్కమ్మ, మహేంద్రమ్మ, నాగమ్మ, జయలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

## 'కౌతాళంను మూడు మండలాలుగా విభజించాలి'

**ప్రజాశక్తి - కౌతాళం**

కౌతాళంను మూడు మండలాలుగా విభజించి ప్రజలకు పరిపాలన అందించాలని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య డిమాండ్ చేశారు. ఉరుకుంద, హాల్వి గ్రామాలను అదనంగా రెండు మండలాలు చేయాలని సోమవారం తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కౌతాళం మండలం చాలా విశాలమైనది, 33 గ్రామాలు ఉన్నాయని తెలిపారు. ఉరుకుంద, హాల్వి గ్రామాలను అదనంగా రెండు మండలాలుగా ఏర్పాటు చేస్తే ప్రజలకు పాలనపరంగా అనుకూలంగా ఉంటుందని చెప్పారు. కౌతాళం మండలానికి కౌతాళం, ఎరిగేరి, తోవి, బదినేహాల్, కుంటనహాల్, ఉప్పరహాల్, రౌడూరు, బాపురం, దమ్ములదిన్నె, అగసలదిన్నె, వీరలదిన్నె, బంటకుంట గ్రామాలు కలపాలని కోరారు. ఉరుకుంద మండలానికి ఉరుకుంద, కామవరం, తిమ్మాపురం, ఓబులాపురం, చిరుతపల్లి, మల్లనహట్టి, కరణి, తిప్పలదొడ్డి, చూడి, పొదలకుంట, మదిరే, సులేకేరి, కాత్రికి, లింగాలదిన్నె కలపాలని తెలిపారు. హాల్వి మండలానికి హాల్వి, గోతుల దొడ్డి, వల్లూరు, గుడికంబాలి, మురళి, కుంబాలనూరు క్యాంపులు, నదీచాగి, మేలిగనూరు గ్రామాలతో మండలాలుగా చేయాలన్నారు. సిపిఎం మండల కన్వీనర్ బి.ఈరన్న, నాయకులు నాగరాజు, వీరేష్, రామలింగ, సత్యప్ప పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

## విద్యార్థిని చదువుకు వెంకప్ప ఆర్థికసాయం

**ప్రజాశక్తి - దేవనకొండ**

దేవనకొండ గ్రామంలోని ఎస్సీ కాలనీలో నివసిస్తున్న బైని పరశురాముడు కుమార్తె బైని పూజిత అగ్రికల్చర్ బీఎస్సీ రెండో సంవత్సరం చదివేందుకు జనసేన ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన ఇచ్చిన రూ.30 వేలను మండల జనసైనికులు సోమవారం పూజిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పూజిత గ్రాడ్యుయేషన్ పూర్తయ్యే వరకు ప్రతేడాది రూ.30 వేల ఆర్థిక సహాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యలో ముందుకు సాగేందుకు, భవిష్యత్తులో మంచి అవకాశాలు పొందేందుకు తెర్నేకల్ వెంకప్ప సహాయం చేస్తున్నట్లు తెలిపారు. జనసేన వీర మహిళ సరోజ, నాయకులు ఎ.ఉచ్చీరప్ప, రామాంజి, జగదీష్, బాలు, గోవిందు, చంటి, రంగస్వామి, బొడ్డు నాగరాజు, ఈశ్వర్, సతీష్, డిజె రంగస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం చేస్తున్న జనసైనికులు

## 'దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలి'

**ప్రజాశక్తి - ఆదోని**

పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ దోమల నియంత్రణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, తిప్పన్న కోరారు. సోమవారం సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు వెంకటేశులు, వీరేష్, నాగరాజు, వెంకటేష్, మోహన్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ ప్రధాన రోడ్లు, వీధులు, కాలనీల్లో మురుగు కుంటలుగా మారాయన్నారు. ప్రజలపై దోమలు దండయాత్ర చేస్తున్నాయని, డెంగీ, మలేరియా, చికున్ గున్యా వంటి జ్వరాలు సోకి ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సీజనల్ వ్యాధులతో ప్రజలు వైద్యం నిమిత్తం ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉందన్నారు. దోమల నియంత్రణకు మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టణంలో ఫాగింగ్, హైపోద్రవం, బ్లీచింగ్ పౌడర్ లాంటివి రెగ్యులర్‌గా పిచికారి చేయించాలని కోరారు.


మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

## కెజిబివికి కుట్టుమిషన్లు అందజేత

**ప్రజాశక్తి - దేవనకొండ**

దేవనకొండకు చెందిన వెంకట సాయి ట్రేడర్స్, సామాజిక సేవా కర్తలు సదాశివరావు, వేణుగోపాల్ రావు ఆధ్వర్యంలో కస్తూరిబా బాలికల విద్యాలయానికి రెండు కుట్టు మిషన్లను అందజేశారు. సోమవారం ప్రిన్సిపల్ సునీతకు మిషన్లను అందించారు. వారు మాట్లాడుతూ... విద్యార్థులు విద్యతో పాటు వృత్తి విద్యలో భాగంగా కుట్టు మిషన్ నేర్చుకుంటే రాబోయే రోజుల్లో ఎంతో ఉపయోగం ఉంటుందని తెలిపారు. కృష్ణమూర్తి, చిట్టెం నాగేష్ పాల్గొన్నారు.


మిషన్లు అందజేస్తున్న వెంకట సాయి ట్రేడర్స్ నిర్వాహకుడు

# పేరుకుపోయిన అపరిశుభ్రత

- దోమల స్వైరవిహారం..!
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- నివారణ చర్యల్లో అధికారులు విఫలం

**ప్రజాశక్తి - హోళగుంద**

**మండలంలో పారిశుధ్యం పేరుకుపోయింది. పరిశుభ్రత లేకపోవడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలపై దాడి చేస్తున్నాయి. దోమకాటుకు గురయి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. నివారణ చర్యలు చేపట్టాల్సిన సంబంధిత సర్పంచులు, గ్రామ కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.**

మండలంలో 17 పంచాయతీలు, 23 మజరా గ్రామాలు ఉన్నాయి. ఏ పంచాయతీకి వెళ్లినా సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక ప్రతి వీధిలోనూ నీరు నిల్వ ఉంటూ అపరిశుభ్రత నెలకొంది. దోమల వృద్ధి చెంది కాటు వేయడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దోమల నివారణకు చర్యలు చేపటాల్సిన అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. చుట్టపు చూపుగా గ్రామాలకు వచ్చి వెళ్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

**అపరిశుభ్రతతో దోమలు వృద్ధి**

అపరిశుభ్రత కారణంగా దోమలు వృద్ధి చెందుతున్నాయి. డ్రెయినేజీలో మురుగునీరు నిల్వ ఉండడం, దుర్వాసన వెదజల్లడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఎక్కడ చూసినా అపరిశుభ్రత తాండవిస్తున్నా పంచాయతీ కార్యదర్శులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.


అపరిశుభ్రంగా మారిన పరిసరాలు

### దోమల వల్ల అనారోగ్యం పాలవుతున్నాం

**- వీరేష్, గ్రామస్తుడు, హోళగుంద**



గతనెల రోజులుగా దోమల బెడద అధికంగా ఉండడంతో అనారోగ్యం పాలవుతున్నాం. దోమల నివారణకు మేజర్ పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలి. వారంలో రెండుసార్లు ప్రతి వీధిలోనూ దోమల నివారణకు ఫాగింగ్ చేయాలి. అధికారులు అలా ఆలోచించకపోవడం బాధాకరం.

### చెత్తాచెదారం నిల్వ లేకుండా చూడాలి

**- నాగేంద్ర, ముద్దటమాగి**



గ్రామంలో చెత్తాచెదారం నిల్వ లేకుండా చూడాలి. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అంతంత మాత్రంగానే ఉంది. వీధుల్లో నీరు నిల్వ ఉంటున్నాయి. దీనివల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇంటి నుంచి బయటికి వెళ్లాలంటే భయమేస్తోంది. అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలి.




యూరియాను పంపిణీ చేస్తున్న నాయకులు

## రైతులకు యూరియా పంపిణీ

**ప్రజాశక్తి - నందవరం**

మండలంలోని హాలహర్వి గ్రామంలో ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు టిడిపి మండల నాయకులు రైస్‌మిల్ నారాయణ రెడ్డి, టిడిపి గ్రామ అధ్యక్షులు ఎం.ఎర్రన్న, నాయకులు జగన్నాథ్ రెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ మేరీలు సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులకు యూరియా కొరత లేకుండా ఎమ్మెల్యే బీవీ చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రతి రైతుకూ యూరియాను అందిస్తున్నామని చెప్పారు. జి.ఏసేపు, గొల్ల రవి, బోయ ఉరుకుంద, జి.ఇమ్మానుయేలు, రైతులు పాల్గొన్నారు.

## యూరియా కొరత తీర్చాలి : కాంగ్రెస్

**ప్రజాశక్తి - ఆదోని**

రైతులకు యూరియా అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని, యూరియా కొరత తీర్చాలని కాంగ్రెస్ ఆదోని, ఎమ్మిగనూరు ఇన్‌ఛార్జీలు రమేష్ యాదవ్, ఖాసీంవలీ విమర్శించారు. యూరియా కొరతపై సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులకు సకాలంలో యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గతేడాది 39.5 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగించారని, ఈఏడాది కేవలం 32 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు మాత్రమే సరిపోతాయని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఆదోని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వై.సాయినాథ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి రావు, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వీరేష్ యాదవ్, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు దేవిశెట్టి వీరేష్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర నాయకులు శ్రీనిథ్, గుజరి నూర్, ఫరూక్ అహ్మద్, రామన్న యాదవ్, నిసార్ అహ్మద్, మాణిక్యరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.


నిరసన చేపడుతున్న కాంగ్రెస్ నాయకులు

## బాలికల హాస్టల్ ఏర్పాటుపై నివేదిక

**- బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆఫీసర్ శ్రీనివాసులు**


మాట్లాడుతున్న శ్రీనివాసులు

**ప్రజాశక్తి - మంత్రాలయం**

బాలికల హాస్టల్ అవసరం గురించి ఉన్నతాధికారులకు నివేదిక తయారు చేసి పంపిస్తామని బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆఫీసర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం నియోజకవర్గంలో బాలికల హాస్టల్‌కు అవసరమైన స్థల పరిశీలనకు వచ్చారు. ఆర్‌విఎఫ్ పోరాట ఫలితంగా బీసీ వెల్ఫేర్ అధికారులు స్పందించినట్లు ఆ సంఘం నాయకులు ఖాజా, కృష్ణ, వీరేష్ తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాత భవనాన్ని విద్యార్థి సంఘం నాయకులతో కలిసి పరిశీలించి విద్యార్థులు, గ్రామాల సంఖ్య తదితర అంశాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపించి హాస్టల్ ఏర్పాటు చేస్తామని శ్రీనివాసులు హామీ ఇచ్చారు. బాలుర హాస్టల్ వార్డెన్ అజీమ్, ఎమ్మిగనూరు హాస్టల్ వార్డెన్ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

## పంట కోత ప్రయోగాలపై వివరించాలి

**- ఎడిఎ చంగల్ రాయుడు, ఎఒ శ్రీరామ్ ప్రవీణ్**

**ప్రజాశక్తి - చిప్పగిరి**

పంట కోత ప్రయోగాలపై రైతులందరికీ అర్థమయ్యేలా వివరించాలని ఎడిఎ చంగల్ రాయుడు, ఎఒ శ్రీరామ్ ప్రవీణ్ తెలిపారు. సోమవారం చిప్పగిరి రైతు సేవా కేంద్రంలో ఎఇఒ రమాదేవి ఆధ్వర్యంలో రైతు సేవా అగ్రికల్చర్ అసిస్టెంట్లకు పంట కోత ప్రయోగాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ... ఏయే పంటలకు, ఏయే మిషన్లు వాడాలి, వాటి పనితీరు, పంటల కోతకు ఉపయోగపడే యంత్రాలు, ఏ ధరలు ఎలా ఉన్నాయి ఇవన్నీ వివరించాలన్నారు. ఎఎస్ఒ అనిల్, రైతు సేవా అగ్రికల్చర్ అసిస్టెంట్లు రంగస్వామి, ప్రతాప్ నాయుడు, మనోహర్, జ్యోతిర్మయి పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యను తీర్చండి

**- చిప్పగిరి ఎస్సీ కాలనీవాసుల మొర**

**ప్రజాశక్తి - చిప్పగిరి**

నెల రోజులవుతున్నా తమ కాలనీకి తాగునీరు విడవడం లేదని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని చిప్పగిరి ఎస్సీ కాలనీవాసులు కోరారు. సోమవారం కాలనీవాసులు జీఎస్.నెట్టి, నాగార్జున, మల్లికార్జున, మల్లయ్య, శివన్నలు మండల కార్యాలయంలో పరిపాలన అధికారి శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... ఎస్సీ కాలనీలో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని, మినీ ట్యాంకర్ దగ్గర నుంచి పోస్టాఫీస్ కార్యాలయం వరకు డ్రెయినేజీ కాలువ నిర్మించాలని కోరారు. గోవిందమ్మ, అంజి, బాలరాజు, వన్నూరప్ప పాల్గొన్నారు.

## 'మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి'

**ప్రజాశక్తి - నందవరం**

మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు వాలంటీరు టీచర్లు కృషి చేయాలని జిల్లా వయోజన విద్యా అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రతాప్ తెలిపారు. సోమవారం స్త్రీ శక్తి భవనంలో 'ఉల్లాస్ అక్షర ఆంధ్ర'ను డిఆర్‌డిఎ ఎపిఎం రాఘవేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. డిప్యూటీ ఎంపిడిఒ సందీప్ కుమార్, జిల్లా వయోజన విద్యా అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రతాప్, సూపర్‌వైజర్ నేమిలయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో 11,541 మంది మహిళలు నిరక్షరాస్యులు ఉన్నారని, వారిని అక్షరాస్యులుగా చేయడమే 'ఉల్లాస్ అక్షర ఆంధ్ర' ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

## 'మద్యం సేవించి వాహనాలు నడపొద్దు'

**ప్రజాశక్తి - మంత్రాలయం**

వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎస్ఐ శివాంజల్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని చిలకలడోన గ్రామం వద్ద జాతీయ రహదారి 167పై డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. వాహనదారులు మద్యం సేవించారా లేదా అని మిషన్ ద్వారా పరీక్షలు చేసి మద్యం సేవించిన వాహన దారులకు అపరాధ రుసుం విధించారు. హెడ్ కానిస్టేబుళ్లు లక్ష్మి నారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఇంజినీర్ల కృషి అభినందనీయం

**- లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ గోపీనాథ్**

**ప్రజాశక్తి - ఆదోని**

సమాజంలో ఇంజినీర్లకు ప్రత్యేక స్థానం ఉందని, వారి కృషి అభినందనీయమని లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. ఈనెల 15న జాతీయ ఇంజినీర్ల దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇంజినీర్లకు పూలమాల, శాలువా వేసి సన్మానించారు. అనంతరం ఇంజినీర్లు హరిత, యశస్విని, లక్షణ, అలేఖ్య, కిరణ్, నితిన్, మహంతేష్, అభినయ్‌ని సన్మానించారు. సీనియర్ లయన్, ఉపాధ్యక్షులు గోవింద రాజమూర్తి, జిల్లా ఛైర్మన్ ప్రసాదరావు, అధ్యక్ష, కార్యదర్శులు ధర్మారెడ్డి, శ్రీనాథ్ గుప్తా, కోశాధికారి వనపరాజు పాల్గొన్నారు.

## కామన్‌దొడ్డిలో మసీదు ప్రారంభం

**ప్రజాశక్తి - కోసిగి**


మండలంలోని కామన్ దొడ్డి గ్రామంలో సోమవారం నూతన సున్నీ జామియా మసీదును ముస్లిం, మైనారిటీలు ప్రారంభించారు. గ్రామ ముస్లిం, మైనారిటీల ఆధ్వర్యంలో ఇమామ్ హాఫీజ్ షేక్ మహబూబ్ బాషా ఖాద్రీ అధ్యక్షతన ముస్లిం మత పెద్దలు, యువకుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్రారెడ్డి, వైసిపి జిల్లా కార్యదర్శి మురళీమోహన్ రెడ్డి హాజరయ్యారు. అతిథులకు ముస్లిం, మైనార్టీలు శాలువా, పూలమాలతో సన్మానించారు. మత పెద్ద మహ్మద్ అబ్దుల్ షకూర్ ఖాద్రీ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**- ఎమ్మిగనూరు వాలీబాల్ అసోసియేషన్**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని ఎమ్మిగనూరు వాలీబాల్ అసోసియేషన్ సీనియర్ క్రీడాకారులు బాబాఖాన్, విక్రమ్, గోవిందు, శంకర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో వైవిఎ ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్-19 విభాగంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలకు ఎంపికైన కమ్మరి రాఘవేంద్ర ఆచారి, ప్రకాశం జిల్లాకు ఉత్తమ ఎస్ఎ పిఇటిగా ఎంపికైన ఎమ్మిగనూరుకు చెందిన ఎ.శ్రీనివాసులును పూలమాలలతో సన్మానించారు. సీనియర్ క్రీడాకారులు ప్రసాద్, పెద్ద ఈరన్న, సునీల్, రమేష్, ప్రిన్స్ వహాబ్, గోవిందు, రామకృష్ణ నాయుడు, పాల శ్రీనివాసులు, సూరజ్, గౌడ్ పాల్గొన్నారు.


సన్మానం చేస్తున్న సభ్యులు

## కరువు భత్యం ప్రకటించాలి : ఎపిటిఎఫ్

**ప్రజాశక్తి - ఆదోని రూరల్**

కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా ఉపాధ్యాయుల సంక్షేమం పట్ల నిర్లిప్తతను, నిర్లక్ష్యాన్ని కనబరుస్తోందని ఎపిటిఎఫ్ నాయకులు విమర్శించారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గం పిలుపుమేరకు సోమవారం ఆదోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. జిల్లా అధ్యక్షులు నాగరాజు అధ్యక్షత వహించి మాట్లాడారు. ధరల సూచీ ప్రకారం కేంద్ర ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకోసారి డిఎ ప్రకటించిన ప్రతిసారీ రాష్ట్ర ప్రభుత్వం కరువుభత్యాన్ని ప్రకటించాలని కోరారు. డివిజన్‌లోని వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పార్థసారథి, రాఘవేంద్ర, లక్ష్మీనారాయణ, భీమారెడ్డి, సోమశేషాద్రి రెడ్డి, వెంకటరమణ, ఈసన్న, ముత్తన్న, గోపీ నాయక్, రామసుబ్బారెడ్డి, వీరేష్, ప్రభాకర్, సంగమేశ్వర స్వామి, సుబ్రహ్మణ్యం, అయ్యప్ప, మల్లికార్జున, నల్లన్న, రవికుమార్, మునీర్, లక్ష్మన్న, అశ్వతప్ప, సిద్ధలింగ, జగదీష్ పాల్గొన్నారు.


ఎపిటిఎఫ్ నిరసన



# రహదారులకు మరమ్మతులు చేయిస్తాం

**- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ్మ**

**ప్రజాశక్తి - ఆదోని**

కూటమి ప్రభుత్వంలోనే రహదారుల మరమ్మతులు చేపడతామని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. సోమవారం కొత్త బ్రిడ్జి సమీపంలో ఉన్న రహదారిపై వర్షపు నీరు నిలిచి ఉండడంతో ఆమె పరిశీలించారు. అక్కడ పరిస్థితిని చూసి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి విషయం తెలిపారు. అధికారులు సానుకూలంగా స్పందిస్తూ రహదారి మరమ్మతులకు అనుమతి వచ్చిందని.. త్వరలో పనులు పూర్తి చేయిస్తామని సమాధానం ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఆమె మాట్లాడుతూ... వైసిపి హయాంలో రహదారులు అధ్వానంగా మారాయని, సంక్షేమం పేరుతో రాష్ట్రంలో మోయలేనన్ని అప్పులు చేశారని విమర్శించారు. రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని తెలిపారు. మాజీ జడ్‌పిటిసి రాంభీం నాయుడు, మాజీ ఎంపిపి మురళీ, మల్లయ్య, బంగారు బాబు, విజయ్, పెద్ద చిట్టి, చిన్న చిట్టి పాల్గొన్నారు.


రహదారులను పరిశీలిస్తున్న గుడిసె ఆది కృష్ణమ్మ

# కర్నూలు 'ప్రతిభ' విజయకేతనం

## ఎపిడిఎస్‌సి-2025లో 612 పైగా ఉపాధ్యాయుల ఎంపిక



ఉద్యోగాలె పొందిన అభ్యర్థులతో డైరెక్టర్ అరుణాచల రెడ్డి

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

ఎపి డిఎస్‌సి 2025లో కర్నూలు ప్రతిభ కోచింగ్ సెంటర్ మరోసారి తన సత్తాను చాటింది. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ పరీక్షల్లో ప్రతిభ అభ్యర్థులు రాణించి 612 పైగా ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. డిఎస్‌సి పరీక్షల్లో ఎస్‌జిటి, ఎస్ఎ, టిజిటి, పిజిటి విభాగాల్లో విశేష ఫలితాలు సాధించడం గర్వకారణమని కోచింగ్ సెంటర్ డైరెక్టర్ అరుణాచలం రెడ్డి తెలిపారు. విద్యార్థుల కృషి, పట్టుదల, వారాంతపు పరీక్షలు, ప్రశ్నల విశ్లేషణ, అధ్యాపకుల నిరంతర పర్యవేక్షణ వలననే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. విద్యార్థులు కూడా తమ విజయానికి కారణం ఉపాధ్యాయుల నాణ్యమైన బోధన, రోజువారీ పరీక్షలు, వెంటనే ఫలితాలు ఇవ్వడం, పరీక్షా పేపర్ల విశ్లేషణ అని అభిప్రాయపడ్డారు. రాష్ట్రస్థాయి ర్యాంకుల్లోనూ ప్రతిభ విద్యార్థులు అగ్రస్థానాలు సాధించారు.

**మొదటి స్థానం:** వి.నాగరాజు (జీవశాస్త్రం 85.67), ఎర్రమల సుభాషిని (జీవశాస్త్రం 81.35), కె. వెంకటేశ్వర నాయక్ (గణితం 75.64).

**రెండో స్థానం:** కొమ్ము సుధారాణి (సామాజిక శాస్త్రం 80.04), బరికె సుమలత (సామాజిక శాస్త్రం 81.75).

**మూడో స్థానం:** పుల్లయ్య గంజి (భౌతిక శాస్త్రం 78.89), తూర్పునాటి రమాదేవి (జీవశాస్త్రం 79.03), జోన్-4 కర్నూలులో టిజిటి విభాగం 78.64 మార్కులతో మూడవ ర్యాంకు సాధించారు.

**నాలుగో స్థానం:** వై. చెన్నకేశవరెడ్డి (అనంతపురం జిల్లా, ఎస్‌జిటి 92.030).

**ఐదో స్థానం:** వి.సంపత్ కుమార్ (తెలుగు 83), పి. సుల్తాన్ బాషా (సామాజిక శాస్త్రం 83.20).

**ఏడవ స్థానం:** వి. రాజ్‌కుమార్ (75.55).

**తొమ్మిదో స్థానం:** బంటుపల్లె మద్దయ్య (సామాజిక శాస్త్రం 81.75).

అనంతపురం జిల్లా నుండి ఎస్.సబ అంజుమ్ (ఎస్‌టి 89.01) మొదటి స్థానం, కడప జిల్లా నుండి సంజీవ రాయుడు (జీవశాస్త్రం 80.54) ఎనిమిదో స్థానం సాధించారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని నిర్వహించిన అభినందన సభలో మెగాడిఎస్‌సి-2025లో ఈ విజయం ప్రతి అభ్యర్థికి ప్రేరణ కలిగించే మైలురాయి అని డైరెక్టర్ అరుణాచలం రెడ్డి పేర్కొన్నారు.

## దోబీఘాట్ల మరమ్మత్తులకు నిధులివ్వాలి


కర్నూలు కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న గురుశేఖర్ , జయమ్మ తదితరులు

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

కర్నూలు నగరంలో దోబీఘాట్ల మరమ్మతులకు నిధులు కేటాయించాలని కర్నూలు కార్పొరేషన్ కమిషనర్ విశ్వనాథ్‌ను రజకవృత్తిదారుల సంఘం నాయకులు కోరారు. సోమవారం కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్‌కు ఎపి రజకవృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి గురు శేఖర్, జిల్లా ట్రెజరర్ సిహెచ్ శ్రీనివాసులు, కర్నూలు న్యూ సిటీ అధ్యక్ష కార్యదర్శులు రాముడు, శేషాద్రి, ఓల్డ్ సిటీ కార్యదర్శి సి.జయమ్మ, జిల్లా కమిటీ సభ్యులు సి.ఎల్లయ్య, నగర నాయకులు మద్దిలేటి, శ్రీను, రమేష్‌లతో వినతిపత్రం ఇచ్చారు. జిల్లా కార్యదర్శి సి. గురు శేఖర్ మాట్లాడుతూ నగరంలో 2009 వరదలు వచ్చిన సందర్భంగా అప్పటి ప్రభుత్వం నగరంలో దోబీఘాట్ల నిర్మాణం కొరకు నిధులు కేటాయించి రోజా ప్రకాష్ నగర్ దగ్గర సంకల్ బాగు, కొత్తపేట, చిత్తారి వీధి, జమ్మి చెట్టు, దగ్గర దోబీ ఘాట్లను రూ.లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టారన్నారు. అయితే నేటికీ కూడా ఏ ఒక్క దోబీఘాట్ కూడా వృత్తికి అవసరమైన విగా లేవన్నారు. సరైన వసతులలో నిర్మాణం లేక మద్యం సేవించడానికి అడ్డాలుగా దోబీఘాట్లు ఉన్నాయన్నారు. కనుక రజక వృత్తి చేసుకోవడానికి వీలుగా దోబీఘాట్ల మరమ్మతులకు మున్సిపల్ కార్పొరేషన్ నుండి నిధులను కేటాయించి వాటిని రిపేర్ చేసి రజక వృత్తికి అవసరమయ్యే విధంగా ప్రయత్నం చేయాలని కోరారు. అదేవిధంగా కర్నూలు నగరంలో 40,000 మంది రజకులు జీవనం కొనసాగిస్తున్నారన్నారు. రైతాంగ సాయుధ పోరాట వీరనారి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు కొరకు స్థలాన్ని కేటాయించాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం తరపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. నిజాం నవాబులకు వ్యతిరేకంగా దున్నేవాడికే భూమి కావాలని రజక సామాజిక వర్గంలో పుట్టి బానిసత్వానికి వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాడిన వీరనారి ఎంతోమంది భూమిలేని వారికి భూమి హక్కు పొందేలా పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ అని, ఆమె విగ్రహం ఏర్పాటు చేసుకోవడం కొరకు స్థలాన్ని కేటాయించాలని కోరారు. హంద్రీ నదిలో కెఇ. మాదన్న నగర్ పక్కన ఉన్న హంద్రీ నదిలో పార్కుకు ఐలమ్మ పేరు పెట్టాలని కోరారు. కమిషనర్ స్పందిస్తూ పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## 35 వ వార్డులో సిసి రోడ్డు వేయాలి

**ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్**

కర్నూలు నగర పాలక సంస్థ కల్లూరు 35 వ వార్డు గోవర్ధన్ నగర్ రైతు బజార్ కు ఎదురుగా ఉన్న మెయిన్ రోడ్డు సిసి రోడ్డు వేయాలని సిపిఎం ప్రతినిధి బృందం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ చిన్న రాముడును కలిసి వినతి పత్రం సమర్పించారు. జరిగింది. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె .సుధాకరప్ప మాట్లాడుతూ గోవర్ధన్ నగర్ రైతు బజార్‌కు ఎదురుగా ఉన్న రోడ్డు మెయిన్ రోడ్డుగా ఉందని ఈ రోడ్డు గుండానే అనేక కాలనీల వాళ్ళు రోజు ప్రయాణం కొనసాగిస్తుంటారన్నారు. వర్షం వచ్చిందంటే రోడ్డు మొత్తం నీళ్లు నిలబడి బురదమయమై రెండు మూడు రోజుల వరకు వాహనదారులు, పాదాచారులు తమ ఇళ్లకు వెళ్లాలంటే సుదూర ప్రాంతాల రోడ్ల ద్వారా వెళ్తున్నారన్నారు. రోడ్డు బురద ఉన్న కారణంగా పై కాలనీలకు వచ్చే స్కూలు బస్సులు కూడా రాక విద్యార్థులు స్కూళ్లకు కూడా వెళ్లలేక పోతున్నారని తెలిపారు. ఈ రోడ్డు గుండా



పందిపాడు ,గవర్నమెంట్ కాలనీ అక్కడ ఉన్న గోడల ఆంజనేయస్వామి గుడికి పైన ఉన్న కాలనీలకు చెందిన ప్రజలు ఈ రోడ్డు వెంటనే నిత్యం వెళుతూ ఉంటారని తెలిపారు. వెంటనే కమిషనర్ జోక్యం చేసుకొని ఈ రోడ్డును సిసి రోడ్డు గా వేయాలని కోరారు .వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్.అక్బర్ బాషా, ఎ.గోవిందు, జె .శ్రీనివాసులు, సూర్యనారాయణ ఉన్నారు.

# క్రిటికల్ కేర్ యూనిట్ సివిల్ వర్క్స్ వేగవంతం

## -ఎపిఎంఎస్ఐడిసి ఇంజనీర్లకు ఆదేశం

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నందు నిర్మాణంలో ఉన్న న్యూ దయాగ్నస్టిక్ బ్లాక్ లో క్రిటికల్ కేర్ యూనిట్ సివిల్ వర్క్స్ పనుల పురోగతిని సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్, డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఎపిఎంఎస్ఐడిసి ఇంజనీర్లు కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులతో సమావేశమై పనుల నాణ్యత, వేగం, సదుపాయాల అమలుపై సమగ్రంగా విశ్లేషించారు. వారు మాట్లాడుతూ రోగులకు ఆధునిక వైద్యసేవలు అందించేందుకు సిసియులో వసతులను అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించాలని సూచించారు. క్రిటికల్ కేర్ యూనిట్ ద్వారా అత్యవసర పరిస్థితులలో రోగులకు తక్షణ వైద్యసేవలు అందించేందుకు విస్తృత సదుపాయాలు లభిస్తాయని తెలిపారు. సమీక్ష సందర్భంగా ఎపిఎంఎస్ఐడిసి ఇంజనీర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ, పనులను అత్యవసర ప్రాధాన్యంతో, నాణ్యతకు లోటు లేకుండా వేగవంతం చేయాలని సూచించారు. క్రిటికల్ కేర్ యూనిట్ పూర్తయి అందుబాటులోకి వస్తే, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు ఇది కీలకమని అన్నారు. పనులపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. సివిల్ వర్క్స్‌తో పాటు ఎలక్ట్రికల్ వ్యవస్థలు, ఆక్సిజన్ లైన్స్, సెంట్రల్ మానిటరింగ్ సిస్టమ్ వంటి సదుపాయాలను ప్రమాణాలతో ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి దశలో పనుల పురోగతిని రికార్డు చేస్తూ, నిర్ణీత సమయానికి పూర్తిచేసి యూనిట్‌ను ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఎపిఎంఎస్ఐడిసి ఇంజనీర్లను కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆసుపత్రి ఇన్చార్జి సిఎస్ఆర్ఎంఓ, డాక్టర్ వెంకటరమణ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివబాల, అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్ కుమార్, నర్సింగ్ సూపరిండెంటెంట్, సావిత్రిబాయి, ఎపిఎంఐడిసి ఇంజనీర్, సెల్వం, కాంట్రాక్టర్, తదితరులు పాల్గొన్నారు.


సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న రామకృష్ణ, తదితరులు

## దేశ ఐక్యతే ఏచూరికి నిజమైన నివాళి

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

దేశాన్ని ఐక్యంగా నిలబెట్టడమే సిపిఎం మాజీ అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరికి ఘనమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రామకృష్ణ అన్నారు. కర్నూలు మండలం గొందిపర్ల, ఇ.తాండ్రపాడు, ఉల్చాల గ్రామాలలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ... ప్రపంచంలో అతికొద్ది మేధావులలో సీతారాం ఏచూరి ఒకరన్నారు. ఉన్నత కుటుంబంలో పుట్టి జీవితాంతం పేద ప్రజల కోసం పనిచేసిన మహనేత అన్నారు. 72 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో 50 సంవత్సరాలు పేద ప్రజల కోసం జీవితాన్ని అర్పించిన నాయకుడని అన్నారు. ఇండియా కూటమి ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించి ఇండియాని ఐక్యంగా నిలబెట్టడానికి కృషి చేశారని అన్నారు. మత ఉన్మాదంతో రాజకీయం చేస్తున్న బిజెపి ఎత్తుగడలను ఎప్పటికప్పుడు గమనిస్తూ మత రాజకీయాలకు వ్యతిరేకంగా అనేక ప్రణాళికలు రూపొందించారని తెలిపాశారు. అలాంటి మహా నేత వారసత్వాన్ని కొనసాగించాలంటే ఇండియాను ఐక్యంగా ఉండడం కోసం మత రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి హుస్సేనయ్య మండల నాయకులు రాఘవేంద్ర, శ్రీరాములు, బాలపీర, సీనియర్ నాయకులు ఆంజనేయులు, పార్టీ సభ్యులు వెంకటస్వామి, రామకృష్ణ, మహమ్మద్ హుస్సేన్, వెంకటేశ్వర్లు, బాలమద్దిలేటి, సిపిఎం కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రక్షణగోడ నిర్మించాలి

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

కర్నూలు నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌కు వెంటనే రక్షణ కూడా నిర్మించాలని డివైఎఫ్ఐ న్యూసిటీ కార్యదర్శి హుస్సేన్ భాష, నాయకులు సుకన్య డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్‌ను వారు కలిసి వినతి పత్రం అందజేశారు. అర్బన్ హెల్త్ సెంటర్లో తాగుబోతులకు అడ్డగా మారిందని పేర్కొన్నారు. వెంటనే రక్షణ కూడా నిర్మించి కాపాడాలని కోరారు. డివైఎఫ్ఐ నగర నాయకులు వీరేష్, వెంకటేష్, జయంతి పాల్గొన్నారు.


కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న పార్వతయ్య, ఎస్ఎండి.షరీఫ్, తదితరులు

## సామూహిక మరుగుదొడ్ల మరమ్మతు చేయాలి

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

కర్నూలు నగరంలోని మూడవ వార్డు బండి మెట్టలో సామూహిక మరుగుదొడ్లను తక్షణమే మరమ్మతులు చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు డి. పార్వతయ్య ,సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు, ఎస్ ఎండి.షరీఫ్, నగర నాయకులు గౌస్ బాషాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొత్తం 20 మరుగుదొడ్లకు గాను ఆరు మాత్రమే రన్నింగులో ఉన్నాయని మిగతా 14 మరమ్మతులు చేయవలసిన అవసరం ఉందన్నారు. దీన్ని బట్టి మహిళల సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చని వారు తెలిపారు .వాటర్ ట్యాంకులకు హోల్స్ పడడంతో మోటార్ తో పట్టిన నీరు అర్థ గంటలో మొత్తం భూమి పాలు అవుతున్నాయన్నారు. ఆ ప్రాంతమంతా బురదమయం అయి రాకపోకలకు ఇబ్బంది అవుతుందని వారు తెపారు. రోడ్లు లేవు, కొళాయిలు లేవు, కరెంటు స్విచ్ బోర్డు పోయిందని, కనీసం స్ప్రూలు కూడా బిగించలేని దుస్థితిలో నగరపాలక సంస్థ ఉందా అని వారు ప్రశ్నించారు. మహిళల పట్ల కమిషనర్ కు ఏం మాత్రం చిత్త శుద్ధి ఉన్నా తక్షణమే బండి మెట్ట లోని సామూహిక మరుగుదొడ్ల దగ్గరకి వచ్చి పర్యటించాలని అక్కడి పరిస్థితులను చూడాలన్నారు. తెలుసుకొని ఆ రకంగా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అక్కడ ఉన్న కేర్‌టేకర్‌ను వేరే పనుల నిమిత్తం నగరపాలక సంస్థ అధికారులు కేటాయిస్తున్నారని , బయటిపని చేసి వచ్చి మళ్లీ మరుగు దొడ్ల పని చేయవలసిన దుస్థితి ఉందని వారు వివరించారు. అనేకసార్లు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకుపోయినప్పటికీపరిష్కారం కావడంలేదని విమర్శించారు. ప్రత్యేకంగా నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు .లేనిపక్షంలో మహిళలను సమీకరించి మున్సిపల్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. మూసమియా,జగదీష్ ,సాయి, వీరేష్, పల్లవి,ఛాయాదేవి, ప్రమీల, మౌనిక గాయత్రిబాయి, మౌనిక బాయి, రమణ బాయి తదితరులు పాల్గొన్నారు.